పల్లవి అధ్యాపకుడికి డాక్టరేట్

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 20: పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ విశ్వప్రకాశ్ బాబు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'ఆప్టిమల్ కంట్రోలర్స్ ఫర్ వోల్టేజ్ కంపెన్సేషన్ యూజింగ్ సోలార్ ఫెడ్ డైనమిక్ వోల్టేజ్ రిస్టోరర్ సిస్టం' అనే అంశం చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. చెన్నైలో డాక్టర్ బీఎస్ అబ్దుల్ రెహమాన్ క్రెసెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ యూనివర్సిటీ కాన్వకేషన్ కార్యక్రమంలో పట్టా అందజేశారు. ఈ సందర్భంగా విశ్వప్రకాశ్ బాబును కాలేజీ చైర్మన్ మల్క కొమరయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎంబీ రాజు, ఇతర ప్రతినిధులు వీఎస్ స్వామి, రాజేందర్‌రెడ్డి, ఏవో శ్రీధర్ అభినందించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కొత్తూరు, ఫిబ్రవరి 20: ఎమ్మెల్యే శంకర్ బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గూడూరు, మల్లాపూర్, ఇమ్మల్‌నర్వ, సిద్దాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని వివరించారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 20: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. సరైన సమయంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ ప్రకాష్, నగర కార్యదర్శి మహిపాల్, నాయకులు హరి కృష్ణ, శివ, తరణ్, విజయ్, శివ, ప్రదీప్, శ్రీనాథ్, పావని, శ్రావ్య పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొత్తూరు, ఫిబ్రవరి 19: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15 నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని చెప్పారు. ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని ఎంపీపీ స్పష్టం చేశారు. సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొనాలని కోరారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరవ్వాలని ఆయన పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు
- బండచరియలో కొలువుదీరిన కోదండస్వామి
- కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు
- ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

తక్కళ్లపల్లి సమీపంలో ఉన్న నామాలస్వామి ఆలయం

యాచారం, ఫిబ్రవరి 20 : పచ్చని పంటపొలాలు మధ్యలో పీఠభూమిలాంటి ప్రదేశం, దానిపై ఎత్తైన గుట్ట, ఆ గుట్టపై వెలిశాడు వెంకన్నస్వామి. కోరిన కోర్కెలు తీర్చాలని ఆ నామాల స్వామిని చుట్టు ఉన్న నాలుగు గ్రామాల ప్రజలు కొంగుబంగారంగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో ఈ గుట్టపై బ్రహ్మోండంగా జాతర నిర్వహిస్తారు. యాచారం మండల పరిధిలోని తమ్ములోనిగూడగేటు సమీపంలో సాగర్ రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ గుట్ట ఉంది. మండలంలోని అతిపురాతన దేవాలయాల్లో ఇదొకటి. ఆలయ ప్రాంగణంలో శివలింగం, ఆంజనేయస్వామి, అలివేలు పద్మావతి విగ్రహాలు ఉంటాయి. మండలంలోని తక్కళ్లపల్లి, కొత్తపల్లి, తమ్ములోనిగూడ, కిషన్‌పల్లి గ్రామాలకు మధ్యలో ఉన్న ఈ ఆలయం నాలుగు గ్రామాలు నమ్ముకున్న శ్రీగోదాదేవి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన ప్రాంతంగా పేరొందింది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు షురూ..

ప్రతి ఏడాది నిర్వహించే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 21 నుంచి 25వరకు కొనసాగనున్నాయి. 21న స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గుట్టపైకి తరలించి, పూజలు నిర్వహించనున్నారు. 22న నాదస్వర సుప్రభాతం, పంచామృత అభిషేకం, సహస్రనామావళి పూజ, మంగళహారతి, మంత్రపుష్పం, గోదాదేవి పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 23న గుట్టపైన సామూహిక వ్రతాలు, అర్చనలు, అభిషేకాలు, గండదీపాలు నిర్వహించనున్నారు. 24న స్వామి వారి రథోత్సవం తదితర కార్యక్రమాలు అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. 25న పంచామృతాభిషేకం, చక్రస్నానం తదితర కార్యక్రమాలను వట్టిపల్లి సుధాకర్‌శర్మ, వట్టిపల్లి ప్రవీణ్‌శర్మ, వట్టిపల్లి ప్రవీణ్‌శర్మల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయంలోని శివలింగం

నాలుగు గ్రామాల దేవుడు..

ఆ గుట్టచుట్టూ కొత్తపల్లి, తక్కళ్లపల్లి, తమ్ములోనిగూడెం, కిషన్‌పల్లి గ్రామాలున్నాయి. ఈ ప్రాంత ప్రజలు నామాల స్వామిని భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. గుట్టపైన ఆంజనేయస్వామి కొలువుదీరారు.

బండచరియలో నామాల స్వామి

ఈ గుట్టపైన ఉన్న దేవాలయం సొరంగంలాగా ఉంటుంది. ఇందులో ఒకే మనిషి పట్టే సైజులో మరోచీకటి సొరంగం ఉంటుంది. అక్కడ బండపైన శంకుచక్రాలు, మూడు నామాలు ప్రతీకలుంటాయి. అక్కడ మనిషి వెళ్లి చెక్కలేని విధంగా ఉండటంతో ఆ నామా లే వేంకటేశ్వరస్వామిని దైవంగా అని, స్వయంబు అవతారమని భక్తులు నమ్ముతారు.

చకచకా ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆలయానికి రంగులు, ప్రాంగణంలో విద్యుత్ దీపాలు, గుట్టపైకి వాహనాలు వెళ్లేందుకు రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సరఫరా, తదితర సౌకర్యాలను పూర్తి చేస్తున్నారు.

కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి

ఉత్సవ మూర్తుల విగ్రహాలు

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

కడ్తాల్, ఫిబ్రవరి 20 : తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మంగళవారం ఉదయం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీనివాస్‌మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు చల్లా వెంకట్‌రెడ్డి, అశోక్‌బాబు, వెంకట్‌రెడ్డి, నర్సింహ, ఎంఏ ఆజీజ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం యాదయ్య తెగువ వెలకట్టలేనిది

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి

తుర్కయంజాల్‌లో సిరిపురం యాదయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 20 : తెలంగాణ ఉద్యమంలో అమరుడు సిరిపురం యాదయ్య తెగువ వెలకట్టలేనిదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి అన్నారు. మంగళవారం సిరిపురం యాదయ్య 14వ వర్ధంతి సందర్భంగా తుర్కయంజాల్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మంగమ్మ, సునీల్, నాయకులు అశోక్, విష్ణువర్ధన్, వెంకటేశ్, నర్సింహ, బలదేవ్‌రెడ్డి, జంగయ్య, వెంకట్‌రెడ్డి, మల్లేశ్ తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని అమర వీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, నాయకులు కరుణాకర్, కర్నె అరవింద్, కానుగుల మహేశ్, జగన్, వెంకటేశ్, మల్లేశ్, కైలాస్ తదితరులున్నారు.

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థి, రాజకీయ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 20 : అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కేశంపేట మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆరు గ్యారంటీలు అమలవుతాయని, ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాండ్ర విశాల, నాయకులు వీరేశం, యాదయ్య, పెంటయ్య, పల్లె ఆనంద్, సురేశ్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

రేపు తల్లిదండ్రుల ఆరాధన దినోత్సవం

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 20: పట్టణంలోని ఠాగూర్ పాఠశాలలో గురువారం సంత్ శ్రీ ఆశారామ్ జీ ఆశ్రమం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల ఆరాధన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉదయం 9 :30గంటలకు తల్లిదండ్రుల ఆరాధన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

30 పడకల దవాఖానను మంజూరు చేయాలి

జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 20 : మండల కేంద్రానికి 30 పడకల ప్రభుత్వ దవాఖానను మంజూరు చేయాలని జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ పాల్గొని మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను సభలో ప్రస్తావించారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న కడ్తాల్ మండలం దినదినాభివృద్ధి చెందుతుందని, పట్టణంలో ప్రభుత్వ దవాఖాన లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి మండల కేంద్రంలో 30 పడకల దవాఖానను నిర్మించాలన్నారు. మండలంలో పలు సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలో పడటంతో రైతులు క్రయవిక్రయాలు చేసుకోలేకపోతున్నారని, బ్లాక్ లిస్టులో ఉన్న భూములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రం సమీపంలో చేపట్టిన కస్తూర్బాగాంధీ విద్యాలయ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్

కడ్తాల్, ఫిబ్రవరి 20 : ఆపదలో ఉన్న వారిని అన్ని విధాలుగా ఆదుకోవడమే ఉప్పల చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని తలకొండపల్లి జడ్పీటీసీ, ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి శ్రీవాణి అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ బాధితురాలి కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. బాధితురాలి వైద్య ఖర్చుల కోసం ట్రస్టు తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవి, మాజీ సర్పంచ్ జ్యోతయ్య, మాజీ ఉప సర్పంచ్‌లు ఆజీజ్, సుధాకర్, నాయకులు విజయ్, సంపత్‌కుమార్, శేఖర్, పాండు పాల్గొన్నారు.

దైవచింతన కలిగి ఉండాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 20 : ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో నిర్మిస్తున్న పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ ఆలయాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు ప్రజల కోరిక మేరకు ఆలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, నటరాజ్, నరేశ్, పూర్ణ, శ్రీను, కిశోర్, శివ, మధు, లక్ష్మణ్, ఎల్లయ్య, రాములు పాల్గొన్నారు.

వైభవంగా గిరిజామృత లింగేశ్వరస్వామి కల్యాణం

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కడ్తాల్ : లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 20: బీష్మ ఏకాదశి సందర్భంగా షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో గిరిజామృత లింగేశ్వరస్వామి(పార్వతీపరమేశ్వరుల)51వ కల్యాణోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి సుప్రభాతం, అభిషేకం, ఎదుర్కోలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో శివస్వాములు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శివస్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : మండల కేంద్రంలో కొలువైన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని వివిధ రకాల పూలు, కొబ్బరి, మామిడాకులతో అందంగా ముస్తాబు చేశారు. ఉదయం స్వామి వారికి వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కలెక్టర్ అనిత, ఆలయ ఈవో మోహన్‌రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, సభ్యులు గోపాల్‌రెడ్డి, శాయిరెడ్డి, యాదయ్య, మోహన్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, జయేందర్‌రెడ్డి, శ్రీరాములు, రఘుపతిరెడ్డి, యాదయ్య, బాబు, మల్లేశ్, శ్రీను పాల్గొన్నారు.

సేవాలాల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

సేవాలాల్ దేవాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న అధికారులు, గిరిజన సంఘం నాయకులు

మంచాల; ఫిబ్రవరి 20 : బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు అధికారికంగా గుర్తింపు ఇచ్చింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని, సేవాలాల్ మార్గం ఆదర్శనీమయని ఎంపీపీ జాటోతు నర్మద అన్నారు. మంగళవారం మండలంలోని లోయపల్లి గ్రామంలో సంత్ సేవాలాల్ జయంతిని నిర్వహించారు. సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేవాలయం ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం కూడా సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించలేదని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు, ఎంపీడీవో బాలశంకర్, ఈవోఆర్డీ తేజ్‌సింగ్, ఎంపీటీసీ రాందాస్, గిరిజన బంజారా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు బాలునాయక్, మాజీ సర్పంచ్‌లు రఘునాయక్, నాయకులు అచ్చిరాం నాయక్, శ్రీధర్‌నాయక్, శివబావోజీ, మోతీరాం, రాజేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి

కడ్తాల్, ఫిబ్రవరి 20 : గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీటీసీ పాలకూర్ల రాములుగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. మరిన్ని నిధులు తీసుకవచ్చి ప్రతి కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకూర్ల రాజీవ్‌గౌడ్, కొత్తపల్లి హరిచంద్ర, ఈర్లపల్లి మహేశ్, రామకృష్ణ, శ్రీనివాస్, యువతరం యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు

బెల్ట్ షాపులో మద్యం సీజ్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 20 : బెల్ట్ షాపులో మద్యాన్ని సీజ్ చేసి, అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. డీఐ నాగరాజు వివరాల ప్రకారం.. మండలంలోని సంకేపల్లి గ్రామంలోని తోకల కిష్టయ్య బెల్ట్ షాపులో మద్యం అమ్ముతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేయగా.. రూ.13, 500 విలువగల 38 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 20 : ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని జడ్పీటీసీ బింగి దేవదాస్ అన్నారు. మండలంలోని బాటసింగారం గ్రామంలో కమిటీ అధ్యక్షుడు రాఖేశ్‌గౌడ్, సీనియర్ సలహాదారుడు ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో శివాజీ జయంతిని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బక్కతట్ల జంగ్యయాదవ్ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్‌పాషా, ఎర్రవెల్లి గౌరీశంకర్‌చారి, నాయకులు లింగంముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్, రాజారాంచారి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 10 జీవాలు మృత్యువాత

మొయినాబాద్, ఫిబ్రవరి 20 : వీధి కుక్కల దాడిలో పది మేకలు మృతి చెందాయి. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. మొయినాబాద్ గ్రామానికి చెందిన ఎండీ నజీర్‌కు గ్రామానికి ఆనుకుని పది గుంటల పొలం ఉంది. దానికి ప్రికాస్ట్‌తో ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. బక్రీద్ పండుగ కోసం మేకలు, మేక పిల్లలను తీసుకొచ్చాడు. వ్యాపారం చేయడానికి తీసుకొచ్చిన 25 మేకలు అతడి వద్ద ఉన్నాయి. ప్రహరీలో ఉన్న మేకలపై రాత్రి సమయంలో వీధి కుక్కలు దాడి చేశాయి. 10 మేకలు, మేక పిల్లలు మృతి చెందాయి. మంగళవారం ఉదయం వెళ్లి చూసే సరికి విగత జీవులుగా పడి ఉన్నాయి. 10 మేకలను చంపడంతో పాటు మరో 6 మేకల మీద దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. రూ.60 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

మంచాల మండలం కాగజ్‌ఘట్ గ్రామంలో వీఆర్‌పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 మంది దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను ఫౌండేషన్ సభ్యుడు అశ్వల బాల్‌రాజ్ మంగళవారం అందజేవారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, సహకార సంఘం డైరెక్టర్ రమేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. – మంచాల, ఫిబ్రవరి 20